GLOBAL TELUGU CHRISTIAN MINISTRIES

# NEWS LETTER

For Private Circulation only July - September 2016

మత్తయి 15:8, "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గానీ, వారి హృదయము నాకు దూరముగా నున్నది". సంఘ ఆరాధనలో దేవుడు, ప్రజలు, కాపరి కలసి ఉంటారు. దేవునికి ప్రజలకు మధ్య కాపరి ఉంటాడు. వీరిలో నిజమైన ఆరాధితులు ఎవరు?

నిజానికి ప్రజలు, కాపరి ఆరాధికులు. ఆరాధితుడు దేవుడు. ఆరాధికులు పాసివ్ పార్టిసిపేంట్స్ కారు.

ఆరాధికులు + కాపరి కలిసి చేసే పనే ఆరాధన. దేవుడు రిసీవర్ అవుతాడు; అనగా పొందేవాడు. దేవుడు మన వద్ద నుండి ఏం పొందాలి?

దేవుడు మన వద్ద నుండి ఏం పొందాలని కోరుకుంటున్నాడో తెలిస్తేనే నిజమైన ఆరాధన జరపగలం.

దేవుని ఆరాధించువారు ఆత్మతోనూ, సత్యంతోనూ ఆరాధించాలని ఒక వ్యభిచారంలో జీవించే స్త్రీ చెబుతోంది (యోహాను 4:24). అంటే వ్యభిచారులం కాని మనకు ఆమాత్రం జ్ఞానం కావాలి.

ఆరాధించడమంటే స్తుతించడం అని కూడా గ్రహించాలి. మరో మాటలో కృతజ్ఞత చెప్పుకోవడం అన్నమాట. కృతజ్ఞత పెదవుల నుండి వచ్చేది కాదు. ఏదైనా అత్యావశ్యకమైన మేలు పొందినపుడు కృతజ్ఞత గుండెలోనుండి వస్తుంది. ఆరాధనంటే ఖచ్చితంగా అదే జరగాలి.

దీనిలో సాక్ష్యము, స్తుతి ఇమిడి ఉంటాయి. సాక్ష్యాలకు ఆరాధనలో ప్రొవిజన్ అవసరం. ఎంచేతనంటే సాక్ష్యము ఆరాధితుల బాధ్యత. ఇవి ఆరాధనలో సమ్మిళితమైనపుడు ఆరాధనా క్రమానికి అర్థం ఉంటుంది. అంటే మన ఆరాధన గాడ్ ఓరియెన్టెడ్‌గా వుండాలి. "ఆరాధనా క్రమం" ఓరియెన్టెడ్‌గా కాదు.

ఆత్మతో ఆరాధించాలి అంటే ఎమోషనలైజ్ కావడం కాదు. పశ్చాత్తాపం, పాపక్షమాపణ ఉన్నప్పుడే పరిశుద్ధాత్ముడు పనిచేస్తాడు. అప్పుడే ఆరాధన సార్థకమౌతుంది.

అ॥కా॥ 2:38 "మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు".

ఆరాధితులు, కాపరి ఉన్నంత మాత్రాన, గుళ్ళో కార్యక్రమం గనుక, ప్రార్థనలూ, పాటలూ వున్నాయి గనుక దేవుడు వున్నాడనుకొంటే పొరపాటు. పరిశుద్ధాత్మను పొందడమంటే దేవుడు నీవద్దకు దిగి రావడం. గుళ్లోనూ, క్రైస్తవుల మధ్య ఆరాధన కాక, ప్రజలు పరిశుద్ధాత్మను ఆహ్వానించాలి. పరిశుద్ధాత్ముని ప్రత్యక్షత మందిరంలో దేవుని ప్రతిష్టిస్తుంది.

మన సంఘాలూ, మన విశ్వాసులూ ప్రభువు ప్రేమకు అర్హులు కావాలని ఆశపడే జీటీసీయెం ఇట్టి ఆరాధనలు మన సంఘంలో వర్ధిల్లాలని ఆశిస్తుంది.

ఆశీస్సులతో...

**రూఫస్**

**జీటీసీయెం నిర్వహించే WTCS - LONDON 2016 సావనీర్‌కు మీ ఆర్టికల్స్ పంపవలసిందిగా కోరుతోన్నాం. వీలైతే Servant Leadership మీద కూడా రాయండి. సెప్టెంబర్ మూడవ వారంలోగా పంపమనవి.**

Very few days to confirm your participation in WTCS - LONDON 2016.

Don't Delay.
Time to get into action.
Please Contact.

# బైబిల్ కాలం తర్వాత ఇశ్రాయేల్ చరిత్ర (గత సంచిక తరువాయి)

ప్రియనాథ్ రూఫస్, రాజమండ్రి

బ్రిటిష్ వారి మీద కోపం ఉన్నప్పటికీ యూదులు యుద్ధంలో బ్రిటిష్ వారినే సమర్ధించడానికి నిర్ణయించుకొన్నారు. ఈ సందర్భంగా యూద నాయకుడు డేవిడ్ బెన్ గురియన్ ఈ విధంగా ప్రకటించాడు. "యుద్ధం లేనట్టుగానే వైట్ పేపర్ కు వ్యతిరేకంగా మేము పోరాడతాం. వైట్ పేపర్ లేనట్టుగానే యుద్ధం లో పోరాడతాం." అలానే యూదులు 130000 సైన్యాన్ని సిద్ధం చేసి బ్రిటిష్ వారికప్పగించారు. అనేక మంది యూదులు బ్రిటిష్ తరుపున శత్రు సరిహద్దుల్లో గూఢచారులుగా తమ సేవలను అందించారు. యూద యోధుడు మోషే దయాన్ యుద్ధ ఏర్పాటుల్లోనే తన కన్ను శాశ్వతంగా పోగొట్టుకొన్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటిష్, యూద అరబ్బులమధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్నాయి. 1947 జూన్‌లో యూదులు అమెరికాలో ఒక పాత ఓడను కొని, రిపేర్స్ చేసుకొని, దానికి "ఎక్సోడస్ 1947" అని నామకరణం చేశారు. ఫ్రాన్స్ కోస్తాలో 4554 మంది యూదకాందిశీకులను పలేస్తీన్ చేరవేయడానికి ముందుకు సాగిపోతోంది. ఇది బ్రిటిష్ వారికి తెలిసిపోయింది. మార్గ మధ్యంలో ఆ ఓడనూ అందులోనున్న 4554 మంది యూదులనూ నడిసముద్రంలో ముంచి వేయడానికి బ్రిటిష్ వారి మూడు షిప్‌లలో తిరిగి ఫ్రాన్స్ హార్బర్‌కు తీసుకుపోయారు. అయితే యూదులు మాత్రం ఓడలోనుండి బయటకు రావడానికి నిరాకరించారు. చేసేదేమి లేక బ్రిటిష్ వారు తమ చేతులు కడుగుకోడానికి ఈ సమస్యను యు.ఎన్.వో.కి. అప్పగించి పలేస్తీన్, ఇశ్రాయేల్ దేశాలుగా విభాగించమన్నారు. నవంబర్ 29, 1947లో జెనీవాలో 33/13 వోట్లతో రిజల్యూషన్ పాస్ చేసింది. 1948 మే 14 మధ్యరాత్రికల్లా బ్రిటన్ పలేస్తీన్‌ను విడిచిపెట్టడానికి తీర్మానించింది. వెంటనే యూద, అరబ్ అండర్గ్రౌండ్ మిలిటెంట్ గ్రూపులు ఒకరిమీద ఒకరు యుద్ధానికి సన్నాహాలు చేసుకొన్నాయి. 14 తెల్లారికి బ్రిటిష్ జెండా గవర్నమెంట్ బిల్డింగ్ మీదనుండి దించివేయబడింది. హోలీ లేండ్ లో 30 సంవత్సరాల బ్రిటిష్ పాలన అంతమైంది. అదే రోజు సాయంత్రం నాలుగ్గంటలకు టెల్ అవిల్ రోత్స్చైల్డ్ వీధిలో మ్యూజియం బిల్డింగ్‌లో బెన్ గురియన్ 400 మంది యూద మిలిటరీ, పొలిటికల్ నాయకులూ, లోకల్, వర్ల్డ్‌వైడ్ వార్తా సంస్థల ప్రతినిధులతోనూ ఉన్న మీటింగ్ ను ప్రారంభించాడు. ఇశ్రాయేల్ జాతీయ గీతం అందరూ పాడారు. అరబ్ సైన్యాలు ముహరించి యున్నందున బయటకు రాలేని జెరూసలేంలో నున్న పది లక్షలమంది యూదులూ ఈ కార్యక్రమాన్ని రేడియోలో విన్నారు. థియోడార్ హెర్జల్ ఫోటో క్రింద నిలబడి స్వతంత్ర ఇశ్రాయేల్ దేశ మొదటి ప్రధాన మంత్రి డేవిడ్ బెన్ గురియన్ "డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్" చదివి వినిపించాడు.

అదే దినం సాయంత్రం ఐదు గంటలకు (న్యూ యార్క్ టైం) మిడిల్ ఈస్ట్ లో యుద్ధ పరిస్థితిని గూర్చి చర్చించేందుకు యు.ఎన్.వో.ఎమెర్జెన్సీ సమావేశం ప్రారంభం కాబోతున్న సమయంలో, స్వతంత్ర ఇశ్రాయేల్ దేశం ప్రకటింపబడిన 11 నిమిషాల్లో యు.ఎన్.వో. ఊహించని విధంగా అమెరికా ప్రెసిడెంట్ హేరీ ట్రూమన్ ఇశ్రాయేల్ దేశాన్ని స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ ఒక ప్రకటన చేశాడు. మే 18 వ తేదీ రష్యా ఇశ్రాయేల్ దేశాన్ని గుర్తిస్తూ ప్రకటన చేసింది. అలా క్రీస్తు శకం 70 నుండి పరాయి పరిపాలనలో నున్న ఇశ్రాయేల్ స్వపరిపాలనను చేపట్టింది.

## 10. ఇశ్రాయేల్ స్వాతంత్ర రాజ్య కాలము (1948 నుండి)

1948 మే నుండి 1973 అక్టోబర్ 6 లోగా ఇశ్రాయేల్, అరబ్బులమధ్య నాలుగు పెద్ద యుద్ధాలు చోటుచేసుకొన్నాయి.

**యుద్ధ కాల వివరాలు :**

1. **వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ :** 1947 నవెంబర్ 29 నుండి 1949 ఫెబ్రువరి 24 వరకు. ఈ యుద్ధ ప్రారంభంలో ఇశ్రాయేల్, అరబ్ దేశాల శక్తిసామర్ధ్యాలు ఇలా వున్నాయ్. అరబ్ శత్రుదేశాలు - ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, ఇరాక్, లెబనాన్.
   **జనాభా:** ఇశ్రాయేల్ - 64,000 అరబ్బులు -4,50,00,000
   అరబ్ సోల్జర్స్ సంఖ్య ఇశ్రాయేల్ సైనికులకంటే 41 రెట్లు ఎక్కువ.
   అరబ్ ల వద్ద యుద్ధాయుధాలు ఇశ్రాయేల్ కంటే 1000 రెట్లు ఎక్కువ
   అరబ్ ల భూభాగం ఇశ్రాయేల్ కంటే 5000 రెట్లు ఎక్కువ.

ఇశ్రాయేల్ కేవలం 10,000 తుపాకీలు, ఐదు లక్షల తూటాలు, నాలుగు పాత ఫిరంగులు, 3,600ల సబ్ మషీన్ గన్స్, ఐదు పనికిరాని కాందిశీకుల కొరకు వాడిన ఓడలూ, ఒక ఐస్ బ్రేకర్, ఒక ఫిషింగ్ ట్రాలర్ మాత్రమే వున్నాయ్. వాటితోనే బరిలోకి దిగింది. అరబ్ సైన్యం యూదులను కేవలం ఎనిమిది రోజుల్లోనే మెడిటరేనియన్ సముద్రంలో ముంచేస్తుంది అని ప్రపంచం అనుకొంది. దానికి విభిన్నంగా యుద్ధం చేస్తూనే ఇశ్రాయేల్ పరంగా బలపడుతూ వచ్చింది. భూభాగాన్ని ఆక్రమించుకొంది. అట్టతో తయారు చేసిన ఫిరంగులను చూపించి ఈజిప్షియన్ యుద్ధనౌకలను వెనక్కి తరిమేసింది. ఈ యుద్ధంలో ఇశ్రాయేల్ 6000 మంది సోల్జర్స్ ని కోల్పోయింది.

## 2. సైనాయ్ వార్ (అక్టోబర్ 29,1956 - నవంబర్ 5, 1956)

ఇశ్రాయేల్ ఈ యుద్ధంలో అరబ్బులను తిరుగుదెబ్బ కొట్టింది. సుమారు 1/3 శత్రు సైన్యాన్ని మట్టుబెట్టింది. ఇశ్రాయేల్ మాత్రం కేవలం 171 మంది సోల్జర్స్‌ని కోల్పోయింది. అత్యధిక సంఖ్యలో రష్యాలో తయారైన యుద్ధ సామగ్రిని కైవసం చేసుకొంది.

### 3. 6 డేస్ వార్ (జూన్ 5, 1967 – జూన్ 10, 1967):

ఇశ్రాయేల్ ఈ యుద్ధంలో ఈజిప్ట్, జోర్డాన్, సిరియాల మొత్తం 444 యుద్ధ విమానాలను ఒక్కరోజులోనే పూర్తిగా నాశనం చేసింది. సూయెజ్ కెనాల్ మీద అధికారం సంపాదించింది. గాజా స్ట్రిప్‌ని ఆక్రమించుకొంది. జోర్డాన్ ఆక్రమించుకొన్న బెత్లేహెం, హెబ్రోన్, జెరికో, నబ్లూస్, రమల్లా, జేనిన్ లను ఆక్రమించింది. ఈజిప్ట్ అత్యధికంగా నష్టాన్ని పొందింది. సుమారు లక్షమంది సైనికుల్ని కోల్పోయింది. సుమారు 700 రష్యా తయారీ టేంకులూ, అత్యధిక సంఖ్యలో ఆయుధ సామగ్రి, 400 ఫీల్డ్ గన్స్, 50 సెల్ఫ్ ప్రోపెల్డ్ గన్స్, వేలకొలదీ వాహనాలనూ ఇశ్రాయేల్ సంపాయించుకొంది.

ఇశ్రాయేల్ తన భూభాగాన్ని ఎనిమిది వందల చదరపు మైళ్ళనుంచి 26,500 చదరపు మైళ్ళకు విస్తరింప జేసింది. ప్రధాని గోల్డా మీర్, మిలిటరీ జనరల్ మోషే దయాన్ ఇశ్రాయేల్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు.

### 4. యామ్ కిప్పూర్ వార్ (అక్టోబర్ 6, 1967 – అక్టోబర్ 25, 1967):

యూదులకు సంవత్సరమంతటిలోనూ పవిత్రమైన డే ఆఫ్ అటోన్మెంట్ (ప్రాయశ్చిత్త దినం) రోజున సడెన్‌గా అరబ్బులు దెబ్బ తీశారు. ప్రపంచ చరిత్రలో ఏ యుద్ధంలోనూ జరగనట్టు పది లక్షల సైనికులూ, వీరిలో అరబ్బులు 8,38,000, 5000 టేంక్స్, 1000 ఎయిర్ క్రాఫ్ట్ పాల్గొన్నాయి. మొదట్లో ఇశ్రాయేల్ ఓడిపోతున్నట్లే అనిపించింది. ఇంతలోనే ఎవరికీ తెలియని కారణంతో అరబ్బులు 48 గంటలు యుద్ధాన్ని నిలిపేశారు.

ఈ 48 గంటల సమయం ఇశ్రాయేల్ వారికి బాగా అనుకూలించింది, అక్టోబర్ 19వ తారీఖున ప్రపంచం కనీ వినీ ఎరుగని రీతిగా టేంక్ యుద్ధం జరిగింది. ఇశ్రాయేల్ జయ జండాను ఎగరవేసింది.

నిన్ను మ్రింగువారందరు మ్రింగివేయబడుదురు, నిన్ను బాధించువారందరు ఎవడును తప్పకుండ చెరలోనికి పోవుదురు, నిన్ను దోచుకొనువారు దోపుడు సొమ్మగుదురు, నిన్ను అపహరించువారినందరిని దోపుడు సొమ్ముగా అప్పగించెదను. వారు – ఎవరును లక్ష్యపెట్టని సీయోననియు, వెలివేయబడినదనియు నీకు పేరుపెట్టుచున్నారే; అయితే నేను నీకు ఆరోగ్యము కలుగజేసెదను, నీ గాయములను మాన్పెదను. ఇదే యెహోవా వాక్కు. యిర్మీయా 30:16-17.

## వన్ డే పాస్టర్స్ సెమినార్ ఇన్ ఉంగుటూరు

ఆకాశం మేఘావృతమౌతుంది; వర్షం పడే సూచనలున్నాయి అని వాతావరణ హెచ్చరిక దినపత్రికలలో వెలువడినను లెక్కచేయని 40మంది దైవజనులు దూరప్రాంతాలనుండి కూడా సమయానికి ఉంగుటూరు చేరుకొని ఒక్కరోజు ఉంగుటూరు పాస్టర్స్ సెమినార్‌ని వైభవంగాను, ఆశీర్వాదకరంగాను జరిపించుటకు దోహదపడ్డారు. స్థానిక సంఘకాపరి రెవ. విజయకుమార్ గారు తన స్థానిక టీమ్ మెంబర్స్‌తో చక్కని ఏర్పాట్లు చేసి, మేము ఉంగుటూరు చేరేటప్పటికి అన్ని సిద్ధంచేసి ఉంచారు. ఇది దేవునికృప! మన తండ్రియైన దేవుడు స్థానిక పాస్టరు గారి మనస్సును రంజింపజేయగా, వారు, వారిబృందం చేసిన అవిరళకృషితో మన జి.టి.సి.ఎమ్ పాస్టర్ల సదస్సు సజావుగా జరిగింది. కొందరు స్థానికులు ఈ 40 మంది దైవజనులతో కలిసి ఆ దినమంతా ఆకలిమరచిపోయి సెమినార్‌లో మునిగితేలారు. మొదటి సెషన్‌లో రెవ. ప్రియనాథ్ రూఫస్‌గారు ఉత్తేజకరమైన "ప్రశ్న – జవాబు" పద్ధతిలో పార్టిసిపేటరీ దిశగా తమ సందేశాన్ని అందించారు. ఇది చాల దీర్ఘంగా సాగింది. రెండవ సెషన్‌లో కొద్దిపాటి టైమ్ మిగిలియుండగా, నేను అదేరీతిలో నా క్లుప్త సందేశాన్ని కొనసాగించాను. చినుకులు పడుతుండగా భోజన విరామమును రద్దు చేసి మధ్యాహ్నం సెషన్ కూడా పూర్తి చేయుటకు అందరూ ఇష్టపడ్డారు. చివరికి అందరమూ భోజనంచేసి మూడు గంటలయ్యిన తరువాత మా మా ప్రదేశాలకు తిరుగమనం పట్టాము. ఇది మాకు గొప్ప "లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్" అని పలువురు వక్కాణించారు. జి.టి.సి.ఎమ్ స్టాఫ్‌గా రెవ. ప్రియనాథ్ రూఫస్ గార్కి నాకు ఇది గొప్ప " రివార్డింగ్ ఎక్స్‌పీరియన్స్" అని చెప్పగలము.



దేవునికి స్తోత్రములు. ప్రభువు చిత్తమైతే సెప్టెంబర్ నెలలో మరియొక పాదిరిగార్ల సదస్సు పేరవరంలోగాని ఆత్రేయపురంలో గాని నిర్వహించాలని ప్రభువు మీద భారంవేసి ఎదురు చూచుచున్నాను. ప్రార్థించండి.

నా ఇమెయిల్ : percyhirams@gmail.com  Cell No : 8121670673

ప్రభుసేవలో మీ ప్రియ సహోదరుడు....

**రెవ. పెర్సి కె.వి. హైరమ్స్**




వచ్చే నెలలో మరోమారు కలసికొనే వరకు ఒకరినిమిత్తం ఒకరం ప్రార్థించుకొందాం.

దేవుని కృప మీకు తోడైయుండి ఆశీర్వదించును గాక.

క్రీస్తులో మీ సహదాసుడు **ప్రియనాథ్ రూఫస్,** ఎక్సెక్యుటివ్ డైరెక్టర్

ఫోన్ : 09494908413, 09848978222 ఈ మెయిల్ : rufus1410@gmail.com

**జి.టి.సి.ఎం. అడ్రస్ :** 11-115, చాపరాల వారి వీధి, అశోక్ నగర్, విజయవాడ-520007. ఫోన్: 0866-2555687.

మేనేజర్: 098660 83001, ఆఫీస్ అసిస్టెంట్: 099087 87745.